

ఎండిన టమాట తోటలు.. దిగాలులో రైతులు


యాచారం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలో టమాట తోటలు నిలువునా ఎండిపోయాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి టమాట సాగు చేస్తే నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా 40 ఎకరాల్లో టమాట తోటలు దెబ్బతిన్నాయని రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. ఎకరం టమాట సాగుకు రూ.35వేలు వెచ్చించామని, వర్షాలతో తోట పాడవడంతో అప్పులు మిగిలాయని ధర్మన్నగూడకు చెందిన రాములు, మంగలిగడ్డతండాకు చెందిన మంగ్‌తా రైతులు వాపోయారు. గడ్డమల్లాయాగూడలో టమాట తోటలు ఎండిపోవడంతో రైతులు దిగాలు పడుతున్నారు.

యూరియా బస్తా.. తప్పదా అవస్థ!

యూరియా కోసం రైతులు ఆగ్రోసేవ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. మండల కేంద్రంలో మూడు ఆగ్రో కేంద్రాలుండగా యూరియా పంపిణీలో ఇబ్బందులను గుర్తించిన ఏవో రాజేందర్ రెడ్డి స్థానిక రైతు వేదిక వద్ద మంగళవారం 700 బస్తాలకు సంబంధించి రైతులకు టోకెన్లు అందజేశారు. రైతులు ఆందోళన చెందొద్దని, అందరికీ యూరియా అందించే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తప్పుడు సమాచారంతో ఒకేసారి యూరియా కోసం రావద్దన్నారు. ఏఈవోలు స్వాతి, సోనిశ్రీ, గౌరిప్రియ, ఆర్ఐ సలీం, రాజు, ప్రవీణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

- చౌదరిగూడ, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి):





టాంగాపై గణనాథుడి శోభాయాత్ర

గణేశ్ నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఊరూవాడా ఆధ్యాత్మి శోభ సంతరించుకుంది. మండపాల్లో ప్రతిష్ఠించిన వినాయకుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. వినాయక చవితి ప్రారంభమైన మూడో రోజు నుంచి నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం షాద్‌నగర్‌లోని ఈశ్వర ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జన శోభాయాత్ర వైభవంగా సాగింది. గణనాథుడిని గుర్రపు టాంగాలపై శోభాయాత్ర నిర్వహించి దగ్గర్లోని చెరువులో నిమజ్జనం చేశారు.

- షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి)



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రైల్వేస్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలి

» చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాత్సవను చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. సికింద్రాబాద్‌లోని రైల్వే కార్యాలయంలో మంగళవారం రైల్వే అధికారులను కలిసి సమస్యలను వివరించారు. శంకర్‌పల్లి రైల్వేస్టేషన్ రెండో ప్లాట్‌ఫామ్‌పై ప్రయాణికుల కోసం షెడ్డు నిర్మించాలని కోరారు. డెమో ప్యాసింజర్‌ను హైటెక్‌సిటీలో నిలపాలని, ముంబై, హుబ్లీ, బీజాపూర్ ఎక్స్‌ప్రెస్‌లను శంకర్‌పల్లి రైల్వేస్టేషన్‌లో నిలపాలన్నారు. రైల్వే బోగీల హోల్డింగ్ సూచిక, లిఫ్టు, స్టేషన్ ఆధునీకరణ, ఫతేపూరం ఆర్‌వోబీ నిర్మాణంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్లు ఉదయనాథ్, శ్రీనివాస్, సీపీఆర్‌వో శ్రీధర్ ఉన్నారు.



భూమి పత్రాలు ఇస్తున్న దాత

గుడి నిర్మాణానికి ముస్లిం వ్యక్తి భూదానం

» రూ.10 లక్షల విలువైన మూడు గుంటలు అప్పగింత

షాద్‌నగర్‌రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): హిందూ ఆలయ నిర్మాణానికి ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామానికి చెందిన ముస్లిం వ్యక్తి తమ ఉదారతను చాటుకున్నాడు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 340లో ఉన్న పోచమ్మ ఆలయాన్ని పునర్ నిర్మించడానికి గ్రామస్తులు పట్టాదారు వారసుడైన మహ్మద్ జాంగీర్‌ను సంప్రదించి ఆలయ నిర్మాణానికి మరి కొంత స్థలం అదనంగా ఇవ్వాలని కోరారు. దీనిపై ముస్లింలు, గ్రామస్తులు మంగళవారం సమావేశమయ్యారు. చర్చల అనంతరం సుమారు రూ.10 లక్షల విలువైన మూడు గుంటల భూమి ఇచ్చేందుకు అంగీకరించారు. అందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలను గ్రామస్తుల సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించినందుకు దాతను గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ నిర్మాణానికి దాతలు కావలి బాల నర్సింలు రూ.11 వేలు, తుప్పరి మల్లయ్య రూ.5,100 విరాళంగా ఇచ్చారు. సమావేశంలో దొడ్డి రవీందర్, మల్లేష్, జంగయ్య, రాందాస్, దొడ్డి శ్రీనివాస్, నర్సింలు, యాదయ్య, బాల్ నర్సింలు, ఇమామ్, ఖాజా, మోహీన్, జహంగీర్, హబీజ్ తదితరులు పాల్గొన్నారు.

7,52,259

జిల్లాలో గ్రామీణ ఓటర్ల సంఖ్య

స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తు వేగంగా జరుగుతోంది. ఓ వైపు రాజకీయ వేడి పెరుగుతుండగా మరో వైపు ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నాయి. పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదల చేసింది. గత నెల 28న పంచాయతీలు, వార్డుల వారీగా ఓటరు ముసాయిదా జాబితాను విడుదల చేయగా తుది జాబితాను మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్ విడుదల చేశారు. ముసాయిదా జాబితాను పరిశీలిస్తే.. తుది ఓటరు జాబితాలో తొమ్మిది ఓట్లు మాత్రమే పెరగడం విశేషం. అత్యధికంగా ఫరూక్‌నగర్ మండలంలో 51,104 ఓటర్లు ఉండగా యాచారం మండలంలో 50,195 మంది ఉన్నారు. అత్యల్పంగా 14,712 ఓటర్లు ఆమనగల్లు మండలంలో ఉన్నారు. మూడు వేలకు పైగా చనిపోయిన, డబుల్ ఓటర్లను గుర్తించారు.

ముసాయిదా జాబితా ప్రకారం			
పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
3,76,873	3,75,353	28	7,52,254
తుది జాబితా ప్రకారం			
పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
3,76,823	3,75,408	28	7,52,259



తుది జాబితా విడుదల చేసిన ఎన్నికల కమిషన్

ఫరూక్‌నగర్‌లో అత్యధికంగా 51,104 మంది ఓటర్లు

అత్యల్పంగా 14,712 మంది ఆమనగల్లులో..

21 మండలాల్లో సింహభాగం మహిళా ఓటర్లే

3 వేలకుపైగా చనిపోయిన, డబుల్ ఓట్ల గుర్తింపు

వేగంగా స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు

త్వరలోనే రానున్న ఎన్నికల నోటిఫికేషన్

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వార్డులు, ఓటర్ల తుది జాబితా రూపకల్పనకు ఆగస్టు 29న జిల్లా స్థాయి, 30న మండల స్థాయి రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించారు. గత నెల 28 29, 30 తేదీల్లో ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 3,624 అభ్యంతరాలు వచ్చాయి. అత్యధికంగా యాచారం, ఫరూక్‌నగర్, ఆమగల్లు, కొందుర్గు, మహేశ్వరం, మొయినాబాద్ మండలాల నుంచి రాగా, డబుల్ ఓటర్స్, డూప్లికేట్ ఓటర్లు, మృతి చెందిన వారి పేర్లను తొలగించాలనే అభ్యంతరాలే ఎక్కువ వచ్చాయి. మూడు వేలకు పైగా చనిపోయిన, డబుల్ ఓటర్ల జాబితాను తయారు చేసి

మిగతా 8వ పేజీలో...



3 వేలకుపైగా చనిపోయిన,

డబుల్ ఓటర్లు

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల తుది జాబితాను పబ్లిష్ చేశాం. మూడు వేలకుపైగా చనిపోయిన ఓటర్లు, డబుల్ ఓటర్ల జాబితాతోపాటు డూప్లికేట్ ఓటర్ల జాబితా తయారు చేసి తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత తహసీల్దార్లకు పంపించాం. ఇవి ఇంకా పెరిగే అవకాశం ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అప్డేట్ అవుతాయి.

- నారాయణరెడ్డి, కలెక్టర్

స్థానిక సంస్థల ఓటర్ల తుది జాబితా..

మండలం	పురుషులు	మహిళలు	ఇతర	మొత్తం
అబ్దుల్లాపూర్‌మెట్	17,740	17,841	4	35,585
ఆమనగల్లు	7,401	7,311	0	14,712
చేవెళ్ల	17,731	17,706	1	35,438
ఫరూక్‌నగర్	25,396	25,704	4	51,104
ఇబ్రహీంపట్నం	15,780	16,053	2	31,835
జిల్లేల చౌదరిగూడ	13,020	12,845	4	25,869
కడ్తాల్	17,489	16,621	2	34,112
కందుకూరు	25,865	25,841	0	51,706
కేశంపేట్	18,316	18,631	0	36,947
కొందుర్గు	11,680	11,979	0	23,659
కొత్తూరు	8,454	8,358	1	16,813
మాడ్గుల	22,780	21,898	0	44,678
మహేశ్వరం	22,233	22,351	4	44,588
మంచాల	20,424	19,496	0	39,920
మొయినాబాద్	15,280	14,969	1	30,250
నందిగామ	13,732	13,826	3	27,561
షాబాద్	24,208	24,109	1	48,318
శంషాబాద్	16,488	16,825	0	33,313
శంకర్‌పల్లి	18,709	19,089	0	37,798
తలకొండపల్లి	19,124	18,734	0	37,858
యాచారం	24,973	25,221	1	50,195
మొత్తం	3,76,823	3,75,408	28	7,52,259



వినతిపత్రం చూపుతున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలని వినాయకుడికి వినతి

మహేశ్వరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపుల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం పురుగుపట్టి బరువు కోల్పోతున్నందున రేషన్ డీలర్లు నష్ట పోతున్నారని రేషన్ డీలర్ల సమం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ పులిమామిడి లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. ప్రభుత్వం స్పందించి నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని వాపసు తీసుకునేలా చూడాలని బాలాపూర్ వినాయకుడికి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. డీలర్లకు సంబంధించిన అనేక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం రాత్రి బాలాపూర్ వినాయకుని ముందు వినతి పత్రం ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా డీలర్లకు రావాల్సిన కమీషన్ వెంటనే విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా ఐదు వేల గౌరవ వేతనం అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మాండ్లు, రంగారెడ్డిజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భానుచందర్, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇదేం తరగతి..!

ఒకే గదిలో రెండేసి తరగతుల నిర్వహణ

ఖాళీగా పోస్టులు..

డిప్యుటేషన్లతో తప్పని తప్పలు

విద్యకు దూరమవుతున్న విద్యార్థులు

పాఠశాలల్లో వెంటాడుతున్న ఉపాధ్యాయుల కొరత

చౌదరిగూడ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వెంటాడుతోంది. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక రెండేసి తరగతులను ఒకే గదిలో కూర్చోబెట్టి విద్యనందిస్తున్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో మొత్తం 28 ప్రాథమిక పాఠశాలలు, ఏడు ప్రాథమికోన్నత పాఠశాలలు, నాలుగు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మొత్తం 2,500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మండల పరిధిలో మొత్తం ఆరు స్కూల్ అసిస్టెంట్, ఎనిమిది ఎస్‌జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందులో జెడ్పీహెచ్ఎస్ చౌదరిగూడలో రెండు గణితం, పెద్ద ఎల్కిచర్ల జెడ్పీహెచ్ఎస్‌లో ఒకటి హిందీ, ఒకటి బయాలజికల్ సైన్స్ తుమ్మలపల్లిలో ఎస్ఏ తెలుగు, ఫిజికల్ సైన్స్

మిగతా 8వ పేజీలో...



తుమ్మలపల్లిలో ఒకే క్లాస్‌లో కూర్చున్న 4, 5 తరగతి విద్యార్థులు



ఉపాధ్యాయులను నియమించాలి

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. ఉపాధ్యాయులు లేక పోవడంతో విద్యాబోధనలో తీవ్రంగా నష్టపోతున్నాం. వెంటనే టీచర్లను నియమించాలి.

- వినయ్, ఏడో తరగతి, తుమ్మలపల్లి

అవినీతికి తావులేదు.. అభివృద్ధిలో రాజీలేదు

» ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అవినీతికి తావులేకుండా, అభివృద్ధిలో రాజీపడకుండా ప్రజా సేవకుడిగా పని చేస్తున్నానని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని ఏడో వార్డు భాగ్యనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన రేషన్ షాపును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే కాలనీల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఈశ్వర్‌కాలనీ, అయ్యప్పకాలనీ, భాగ్యనగర్ కాలనీలలో పర్యటించినప్పుడు రోడ్లు, డ్రైనేజ్ కాలువలు, విద్యుత్ సౌకర్యాం, తాగునీటి సరఫరా కావాలని కాలనీవాసులు కోరారన్నారు. రూ.4.8 కోట్లతో రోడ్లను వేయిస్తూ, రేషన్ షాపును ప్రారంభించానని తెలిపారు. పథకాల లబ్ధి కోసం ఏ ఒక్కరికి రూపాయి ఇవ్వాల్సిన పనిలేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలి అవినీతికి పాల్పడిందని కేసీఆర్ కూతురు కవితనే చెబుతున్నదన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్, నాయకులు ప్రవీణ్, అగ్గనూరి విశ్వం, కృష్ణారెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, కరుణాకర్, దర్శన్, ప్రశాంత్ పాల్గొన్నారు.



రేషన్ షాపును ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

వైఎస్ఆర్ ఆశయాలను నెరవేరుస్తున్నాం

రైతు పక్షపాతి, ప్రజాబంధు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి అన్నారు. వైఎస్ఆర్ వర్ధంతిని పురష్కరించుకుని షాద్‌నగర్ చౌరస్తాలోని రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ఆర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా నిలిపారన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబర్, అగ్గనూరి విశ్వం, బాల్‌రాజ్‌గౌడ్, కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, రఘునాయక్, చెన్నయ్య, ఇబ్రహీం, శ్రీనివాస్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం వీడాలి

విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

7

కాళేశ్వరంపై సర్కార్‌ది కక్షపూరిత చర్య

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రపంచంలోనే ఒక అద్భుతమైన ప్రాజెక్టు అని, 20 లక్షల ఎకరాలకు నీరందించే ఈ ప్రాజెక్టుపై రేవంత్ సర్కార్ కమిషన్లు సీబీఐ అంటూ కక్ష పూరితంగా వ్యవహరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం నిర్మాణంలో అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణ కోరడాన్ని నిరసిస్తూ ఇబ్రహీంపట్నంలో మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సాగర్ రహదారిపై ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి 22 మాసాలవుతుందని, నాటి నుంచి పలు కమిషన్లు, విచారణలంటూ అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నదని మండిపడ్డారు. ప్రతిపక్ష బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను బదనాం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజలకిచ్చిన హామీలను తుంగలో తొక్కి పాలన చేతగాక మూసీ ప్రక్షాళన, హైడ్రా అంటూ ప్రజల్లో భయాందోళనలు కల్పిస్తున్నారంటూ ఆరోపించారు. పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక తప్పుల తడకగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇదే తీరున వ్యవహరిస్తే ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయాలని ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. రాస్తారోకోతో ట్రాఫిక్ ఏర్పడింది. కార్యక్రమంలో నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి, ఆకుల యాదగిరి, ప్యాక్స్ చైర్మన్లు మహేందర్‌రెడ్డి, బిట్ల వెంకట్‌రెడ్డి, కృపేష్, చిలుకల బుగ్గరాములు, అల్వాల వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మంద సురేష్, బాషా, స్వరూప, జెర్కోని రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

అక్రమ తవ్వకాలు జరిపితే చర్యలు

తాండూరు రూరల్, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి):అనుమతి లేకుండా తవ్వకాలు జరుపుతున్నారన్న ఫిర్యాదుతో అధికారులు స్పందించారు. ఓగీపూర్‌లోని సర్వే నంబర్-58లో అనుమతులు లేకుండా నాపరాతి తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో తాండూరుకు చెందిన నాపరాతి వ్యాపారి ఫసియొద్దీన్ లోకాయుక్తయు ఫిర్యాదు చేశాడు. మైన్స్ ఏడీ సత్యనారాయణ, సర్వేయర్ లక్ష్మీనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ నాగలక్ష్మి మంగళవారం ఓగీపూర్ వెళ్లి తనిఖీలు నిర్వహించారు. కొంత భూమి రెవెన్యూ పరిధిలోకి వస్తుందని ఏడీ తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. గనుల్లో అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


నాపరాళ్ల తవ్వకాలు చేస్తున్న వారిని హెచ్చరిస్తున్న ఆర్ఐ సుధ

నాపరాళ్ల గనుల్లో తనిఖీ

బషీరాబాద్ : అనుమతి లేకుండా నాపరాళ్లను తవ్వితే ఉపేక్షించేది లేదని బషీరాబాద్ ఆర్ఐ సుధ హెచ్చరించారు. మంగళవారం తహసీల్దార్ ఆదేశాలతో జీవన్గి నాపరాళ్ల గనుల్లో తనిఖీ చేశారు. దీంతో కొందరు తవ్వకాలను నిలిపి రోడ్డుపైకి రావడంతో ఆర్ఐ మాట్లాడి హెచ్చరించారు. సర్వే నంబరు 297 ప్రభుత్వ భూమిలో కొందరు తవ్వకాలు చేస్తున్నారని, తవ్వకాలను నిలిపి వేయాలన్నారు. ఈ అసైన్డ్ భూమిలో కొందరు అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారని ఆర్ఐకి దృష్టికి తెచ్చారు. కటింగ్ మిషన్లను తరలించాలని ఆర్ఐ ఆదేశించారు. మళ్లీ తవ్వకాలు జరిపితే కేసులు పెడతామని ఆర్ఐ హెచ్చరించి అక్కడినుంచి వెళ్లిపోయారు.

వికేంద్రీకృత మురుగునీటి శుద్ధీకరణ చేపట్టాలి

- నాగ్‌పూర్ హైడ్రోజియాలజీ విభాగం ఇన్‌చార్జి, సీఎంపీడీఐఎల్ మేనేజర్ రాంబాబుసింగ్

మొయినాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు వికేంద్రీకృత మురుగునీటి శుద్ధి చేపట్టాలని నాగ్‌పూర్ హైడ్రోజియాలజీ విభాగం ఇన్‌చార్జి, సీఎంపీడీఐఎల్(సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ లిమిటెడ్) మేనేజర్ రాంబాబుసింగ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధి చిలుకూరు సమీపంలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో సెప్టెంబరు 2నుంచి 4వ తేదీ వరకు నిర్వహించే బలమైన గ్రామీణ, నగర సముదాయాల కోసం.. సస్టెనబుల్ వాటర్ అండ్ వేస్ట్ సెల్యూషన్స్ ఫర్ రెసిల్లియెంట్ రూరల్ అండ్ అర్బన్ కమ్యూనిటీస్(ఎస్‌డబ్ల్యూడబ్ల్యూఎస్)-2025 జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబుసింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మురుగునీటిని పెద్ద కేంద్రీకృత ప్లాంట్లకు తరలించకుండా.. దాని ఉత్పత్తి మూలం వద్దనే శుద్ధి చేయడం వల్ల నీటిని సురక్షితంగా పునర్వినియోగం చేసుకోవచ్చన్నారు. వ్యర్థ జలాలను శుద్ధి చేయడం ద్వారా నదులు, చెరువులు, భూగర్భ జలాలు, కలుషితం కాకుండా ఉంటాయన్నారు. చిన్న పరిశ్రమలు, గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని చిన్న చిన్న సముదాయాల్లో తక్కువ ఖర్చుతో వికేంద్రీకృత మురుగునీటి శుద్ధిని సమర్థవంతంగా చేపట్టవచ్చన్నారు. ఇలాంటి జాతీయ సదస్సులు స్థిరమైన పద్ధతుల్లో జ్ఞానాన్ని పంచుకోవడానికి, పరస్పర సహకారం, ఆవిష్కరణలకు ఉపయోపగడుతాయని ఆయన అన్నారు. సదస్సులో దేశవ్యాప్తంగా వివిధ సంస్థలకు చెందిన దాదాపు 60 మంది నిపుణులు, అధ్యాపకులు, కళాశాల డైరెక్టర్ రోహిత్, ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నర్సయ్య, కో-ఆర్డినేటర్ సౌమ్యసుచరితసంఘీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న రాంబాబు సింగ్ తదితరులు


బన్సీలాల్ వ్యాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చిరంజీవిగా నిలిచిన బన్సీలాల్ వ్యాస్

ఘట్‌కేసర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సేవాభావం, త్యాగనిరతితో గురుకుల్ పాఠశాల వ్యవస్థాపకులు బన్సీలాల్ వ్యాస్ ప్రజల్లో చిరంజీవిగా నిలిచారని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ గురుకుల్ వ్యవస్థాపకులు బన్సీలాల్ వ్యాస్ 69వ వర్థంతి సందర్భంగా మంగళవారం గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. స్వాతంత్ర్యానికి ముందే 25ఎకరాల స్థలం కొని ఆశ్రమ పాఠశాలను నెలకొల్పిన మహనీయుడు వ్యాస్ అని కొనియాడారు. నగరంలోని హైటెక్ సీటీ ప్రాంతంలో వందలాది ఎకరాల భూమిని సేకరించారని తెలిపారు. హైటెక్ సీటీ గురుకుల్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, ఘట్‌కేసర్‌లోనూ గురుకుల్ పరస్థితి అధ్వానంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గురుకుల్ పరిరక్షణకు ప్రజలు ఉద్యమించాలని కోరారు. సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, రిటైర్డ్ అధ్యాపకులు, టీచర్లు, వ్యాస్ కుటుంబీకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

తాండూరు, సెప్టెంబర్2(ఆంధ్రజ్యోతి): తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మల్లినాథప్ప పాల్గొన్నారు.


అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

రైతుబజార్‌ను అభివృద్ధి చేస్తాం

చేవెళ్ల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని రైతుబజార్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని వసతులు కల్పించి అభివృద్ధి చేస్తామని చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు తెలిపారు. మంగళవారం రైతుబజార్‌లో మార్కెట్ నిధులతో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయించారు. మరుగు దొడ్లను బాగు చేయించారు. వారు మాట్లాడుతూ రైతులకు, వినియోగదారులకు ఇబ్బందుల్లేకుండా దశలవారీగా అన్ని వసతులు కల్పించి మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. రైతులు పండించిన కూరగాయలను నేరుగా రైతుబజార్‌లో అమ్ముకోవాలని సూచించారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి మహేందర్, డైరెక్టర్లు మల్లేష్, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, నరేందర్ పాల్గొన్నారు


రైతులతో మాట్లాడుతున్న పెంటయ్య గౌడ్

మౌలిక వసరుల కల్పనకు పెద్దపీట

కందుకూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వనరుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆ పార్టీ మండల సీనియర్ నాయకుడు ఈ.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అగర్‌మియాగూడ గ్రామానికి రూ.5లక్షల వ్యయంతో మంజూరు చేసిన 80 ఎల్ఈడీ లైట్లను ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి చొరవతో తమ గ్రామానికి ఎల్ఈడీ లైట్లు మంజూరైనట్లు తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నాయకులు దిలీప్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రవీందర్, రమేష్, విష్ణు, శ్రీకాంత్, రాజు, తదితరులు పాల్గొన్నారు.


ఎల్ఈడీ లైట్లను ప్రారంభిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

నందిగామ, సెప్టంబరు 2(ఆంధ్రజ్యోతి): పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల మానవ వనరుల శాఖ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఎంఈవో పరిశుభ్రతపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు సురక్షితమైన మంచి నీరు, అబ్బాయిలకు, అమ్మాయిలకు వేర్వేరు మరుగుదొడ్లు ఏర్పాటు, సబ్బుతో చేతులు కడుక్కోవడం, మౌలిక వసతుల నిర్వహణ, పాఠశాలల పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలను ప్రణాళిక పరంగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న ఎంఈవో శ్రీనివాస్

14శాఖ గ్రంథాలయాల ఏర్పాటుకు తీర్మానం

శామీర్‌పేట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొత్తగా 14 శాఖ గ్రంథాలయాల ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీర్మానించిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం శామీర్‌పేట ప్రెస్‌క్లబ్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహాయాదవ్‌తో కలిసి మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 18 లైబ్రరీలు ఉన్నాయని తెలిపారు. కీసరలో నిలిచిన లైబ్రరీ భవన నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. దేవరయంజాల్, అలియాబాద్‌లలో నిర్మిస్తున్న గ్రంథాలయాలను దసరా నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

దెబ్బతిన్న పంటల పరిశీలన

బషీరాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): క్యాద్గీరాలో కాగ్నానది వరద ముంపునకు గురైన పొలాలను ఏఈవో వాసీం మంగళవారం పరిశీలించారు. నదీ పరివాహకంలో 20ఎకరాల వరకు ముంపుతో దెబ్బ తిన్న పొలాల నష్టాన్ని అంచనా వేశారు. పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిస్తామని రైతులకు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో టికెట్ ఇవ్వండి

బషీరాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో తనకు జెడ్పీటీసీ లేదా ఎంపీటీసీగా పోటీ చేసేందుకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్‌కు కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు శంకరప్ప మంగళవారం విన్నవించారు. హైదారాబాద్‌లోని ప్రసాద్‌కుమార్‌ను కలిసి బయోడాటాను అందజేశారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

ఎస్‌బీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవాబుపేట, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. మంగళవారం ఆర్కతలలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్‌చౌదరి హాజరయ్యారు. రైతులు, ప్రజలకు అవసరాలకు అనుగుణంగా ఎస్బీఐ సేవలందిస్తోందన్నారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన ప్రీమియం రూ.436 చెల్లించి రూ.2లక్షల బీమా రక్షణ పొందొచ్చన్నారు. సురక్ష బీమా యోజన ప్రీమియం రూ.20తో రూ.2లక్షల బీమా సదుపాయం అందుతుందన్నారు. పంటల, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, రీకేవైసీ సేవలను ఎస్బీఐ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ ఏజీఎం తాన్యాశర్మ, డీజీఎంలు కుమార్‌రోహిత్, సతీశ్‌కుమార్, ఏజీఎం నితిన్‌కుమార్, రమ్య, ఎల్డీయం యాదగిరి, ఎంపీడీవో అనురాధ, ఏజీఎం ఎస్ఎల్‌బీసీ శ్రీహరి, నవాబుపేట బీఎం అరుణ్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.



బదిలీ అయిన సాంస్కృతిక విభాగం సభ్యులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

సంక్షేమ కార్యక్రమాలను ప్రచారం చేయాలి

వికారాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు తెలియజేస్తూ, పథకాలతో జీవన ప్రమాణాలు పెంచేలా కళారూపాలుండాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మంగళవారం తెలంగాణ సాంస్కృతిక సారథిలో పనిచేస్తున్న గారిపాక బిక్షపతి, చింతల స్వప్న రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. అదనపు కలెక్టర్, జిల్లా పౌర సంబంధాల అధికారి ఆకుల చెన్నమ్మ, సిబ్బందితో కలిసి వారిని లింగ్యానాయక్ శాలువాలతో సన్మానించారు. కళారూపాలద్వారా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారం, పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్యం తదితర అంశాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు కళారూపాలు దోహదపడ్డాయన్నారు. వృత్తి ధర్మాన్ని పాటిస్తూ, సాంస్కృతి కార్యక్రమాల్లో నైపుణ్యాన్ని పెంచుకుంటూ ప్రజల్లో అవగాహన కల్పిస్తూ మన్ననలను పొందాలని ఆకాంక్షించారు.



సీహెచ్‌సీలో వైద్యులతో మట్లాడుతున్న డీఎంహెచ్‌వో లలితాదేవి

రోగుల పట్ల నిర్లక్ష్యం వద్దు

బషీరాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రులకు వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని వికారాబాద్ డీఎంహెచ్‌వో లలితాదేవి వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం నవాల్గ పీహెచ్‌సీ, బషీరాబాద్ సీహెచ్‌సీలను ఆమె తనిఖీ చేశారు. అందిస్తున్న తీరుపై ఆరా తీశారు. డీఎంహెచ్‌వో గోపాల్‌తో పలు అంశాలపై చర్చించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తిం చెందకుండా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీహెచ్‌సీ ఇన్‌పేషంట్లతో మాట్లాడారు. విలేఖర్లతో మాట్లాడుతూ.. గతేడాదితో జిల్లాలో డెంగీ కేసుల సంఖ్య 125 నమోదు కాగా ఈ సారి 43 కేసులు నమోదైనట్లు వివరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జ్వర సర్వే చేయిస్తున్నామని తెలిపారు.



అంతిరెడ్డిగూడలో మాట్లాడుతున్న గజేందర్‌గౌడ్

దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేద్దాం

షాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్వదేశీ వస్తువుల్ని కొనుగోలు చేసి భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేద్దామని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడిగె గజేందర్‌గౌడ్ అన్నారు. బలరాముని జయంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని అంతిరెడ్డిగూడలో మంగళవారం రైతు దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ప్రధానమైన భారతదేశంలో 70 శాతం ప్రజలు వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్నారని, ప్రభుత్వాలు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలని, తద్వారా రైతులు ఆర్థిక పరిపుష్టి చెందుతారన్నారు. అధిక సుంకాల పేరుతో దేశాన్ని బలహీనపరిచే కుట్ర జరుగుతున్నట్లు ఆరోపించారు. సంఘం నాయకులు సత్యనారాయణరెడ్డి, చంద్రయ్య, రామస్వామి, నర్సింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

మంచాల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరిధర్ అన్నారు. బెంగళూరులో రూ.5లక్షల వ్యయంతో రూపొందించిన పీఎస్ఎల్వీ నమూనాను ఆరుట్లలోని ప్రభుత్వ తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థుల సందర్శనార్థం ఉంచారు. ప్రధానోపాధ్యాయులు గిరిధర్ మాట్లాడుతూ క్షేత్ర ప్రదర్శనతో విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించబడతాయని చెప్పారు. మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సుప్రియ, మోహన్‌గౌడ్, యాదగిరి, జహీఆర్, పాపిరెడ్డి, జగదీష్, చందు, పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం

కులకచర్ల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): క్రీడలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. బండవెల్కిచర్ల ఎస్టీ గురుకుల పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్ స్థాయి ఖోఖో పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగాలు సాధించొచ్చన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మొగులయ్య, ఎంఈవో హబీబ్ అహ్మద్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, నాయకుడు గోపాల్‌నాయక్, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు



క్రీడా పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కొనసాగుతున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలు

శామీర్‌పేట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట జోనల్ స్థాయి క్రీడాపోటీలు మంగళవారం రెండోరోజు కొనసాగాయి. మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడలోని జీనియస్ హైస్కూల్లో జోనల్ స్థాయి టోర్నమెంట్ కమ్ సెలెక్షన్ పోటీలు గత సోమవారం ప్రారంభమయ్యాయి. క్రీడల కార్యదర్శి గుర్రం సత్తిరెడ్డి ఆధ్వర్యంలో క్రీడాపోటీలను నిర్వహిస్తున్నారు. శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల 2,200మంది క్రీడాకారులు 180 టీమ్‌లుగా పోటీల్లో పాల్గొంటున్నారు. మంగళవారం ఖోఖోలో తలపడ్డారు. బుధవారం కబడ్డీ పోటీలను నిర్వహిస్తామని సత్తిరెడ్డి తెలిపారు.

ట్రిపుల్ ఆర్ నిర్వాసితుల పోరుబాట

మోమిన్‌పేట్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డుకు భూములు, ప్లాట్లు కోల్పోతున్న నిర్వాసితులు పోరుబాట పట్టారు. మంగళవారం మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డితో కలిసి టేకులపల్లి, దేవరంపల్లి గ్రామాల రైతులు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. ట్రిపుల్ ఆర్‌కు ఇష్టారాజ్యంగా అలైన్‌మెంట్ చేస్తున్నారని, ఈ రోడ్డు ఉత్తర భాగంలో నిర్ధారించిన పరిహారం తమకు సరిపోదని మహేందర్‌రెడ్డి అన్నారు. టేకులపల్లి, దేవరంపల్లి గ్రామాల్లో 100 మంది రైతులు వందల ఎకరాలు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. రోడ్డు సర్వేను అడ్డుకుంటామని రైతులు తెలిపారు.



వర్క్‌షాప్ ముగింపులో వేడుకలో విద్యార్థులు

అనురాగ్‌లో ముగిసిన వర్క్‌షాప్

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో రెండురోజులుగా నిర్వహించిన 'ఎనిమాట్రిక్స్' వర్క్‌షాప్ మంగళవారంతో ముగిసింది. యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రానున్న కాలమంతా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌దేనన్నారు. వర్క్‌షాప్‌లో 157 మంది విద్యార్థులు పాల్గొని వారి సృజనాత్మకతను ప్రదర్శించారు. వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీన్‌లు మల్లికార్జున్‌రెడ్డి, కనకస్వామి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా ఇచ్చేదాకా కదిలేది లేదు

» రైతుల ఆగ్రహం.. రాస్తారోకో



షాద్‌నగర్-కంది జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న పట్నం అవినాష్‌రెడ్డి

యాచారం/ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు/షాబాద్/చౌదరిగూడ , సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తమకు యూరియా ఇచ్చేదాకా కదిలేది లేదని రైతులు పీఏసీఎస్‌ల ఎదుట నిరసనకు దిగారు. ఈమేరకు మంగళవారం యాచారం సొసైటీ ఎదుట రైతులు ఉదయం గంటలకే వచ్చి 12 గంటల వరకు యూరియా కోసం వేచి చూశారు. అయితే, యూరియా ఇవ్వరని తెలిసి రైతులు నాగార్జున సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకోకు సిద్ధమవుతుండగా సీఐ నందీశ్వర్‌రెడ్డి సిబ్బందితో వచ్చి సముదాయించారు. బుధవారం సాయంత్రం వరకు యూరియా అందించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారని సీఐ రైతులకు చెప్పడంతో శాంతించారు. సరిపడా యూరియా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మండల వ్యవసాయాధికారి రవినాథ్ తెలిపారు. రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో రైతులతో కలిసి రాస్తారోకో చేశారు. ఆయన మాట్లాడుతూ యూరియా విషయంలో కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందని, ఇంతటి దౌర్భాగ్యం మరోటి ఉండదన్నారు. ప్రైవేట్ డీలర్లు గోదాంలలో యూరియా నిల్వలున్నప్పటికీ.. కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. సీపీఎం నాయకులు సామేల్, చంద్రమోహన్, జగదీష్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆమనగల్లు పట్టణంలో బస్టాండ్ ఎదుట తలకొండపల్లి రోడ్డులో ఎరువుల దుకాణం వద్ద రైతులు బారులు తీరి నిలబడ్డారు. పెద్దమొత్తంలో యూరియా కోసం రావడంతో పోలీసు బందోబస్తు మధ్య ఏడీఏ శోభారాణి, ఏవో శ్రీనివాస్ గౌడ్‌లు యూరియా పంపిణీ చేశారు. ప్రతీ రైతుకు రెండు చొప్పున బస్తాలు అందజేశారు. అదేవిధంగా రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి అన్నారు. షాబాద్‌లో షాద్‌నగర్-కంది జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. అవసరమైన సమయంలో యూరియా దొరక్కపోవడంతో పంట దిగుబడిపై ప్రభావం పడుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఔరైతులకు ఇబ్బందులు కలగకుండా చూసిందని, కాంగ్రెస్‌కు పాలన చేతకాకపోతే తప్పుకోవాలన్నారు. ధర్నాలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు, మాజీ జడ్పీటీసీ రాజేందర్‌గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, మాజీ కోఆప్షన్ మెంబర్ చాంద్‌పాషా, మాజీ ఎంపీటీసీ మధుకర్‌రెడ్డి, మాజీ సర్పంచులు వెంకట్ యాదవ్, గోపాల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, నర్సింహారెడ్డి, దర్శన్, మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



రాణిరుద్రమ దేవిని సన్మానిస్తున్న ఆచారి, నాయకులు

ఆమనగల్లు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీల అమలులో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ దేవి అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను బీజేపీ శ్రేణులు ప్రజల పక్షాన ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం రాణి రుద్రమ దేవి పర్యటించారు. ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ నాయకులు ఆమెకు స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో రాణి రుద్రమదేవి సమావేశమయ్యారు. కేంద్ర పథకాల అమలు, పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం గురించి చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలన దక్షతతో దేశం అద్భుత విజయాలు సాధిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను బీజేపీ శ్రేణులు గ్రామాల్లో గడప గడపకు తీసుకుపోవాలని సూచించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామిలను అమలు చేయకుండా రేవంత్ సర్కార్ ప్రజలను మోసగించిందన్నారు. గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను హామీల అమలుపై ప్రజలు నిలదీయాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ లను ప్రజలు విశ్వసించడం లేదని రాష్ట్రంలో బీజేపీ ప్రత్యమ్నాయ శక్తిగా నిలుస్తుందన్నారు. మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ఎర్రవోలు శ్రీను, బీజేపీ జిల్లా నాయకులు శ్రీకాంత్‌సింగ్, చెక్కాల లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నర్సింహ, నాయకులు రవిరాథోడ్, పద్మ ప్రశాంత్, ఎర్రవోలు మహేశ్, మల్లయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

దూర విద్యతో ఉజ్వల భవిష్యత్తు



సమావేశంలో ప్రొఫెసర్ ధర్మానాయక్

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దూర విద్య ద్వారా ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని, ప్రతీఒక్కరు దీనిని సద్వినియోగం చేసుకోవాలని డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ధర్మానాయక్ అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టడీ సెంటర్‌ను సందర్శించారు. స్టడీ సెంటర్ కౌన్సిలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కక్ సార్వత్రిక విశ్వవిద్యాలయం రెగ్యులర్ విశ్వవిద్యాలయాలతో సమానంగా దాదాపు అన్ని కోర్సులను అందుబాటులోకి తెచ్చిందన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ జర్నలిజం, లైబ్రరీ సైన్స్, ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంబీఏ లాంటి కోర్సులను అందిస్తుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి డిగ్రీలో బీబీఏ కోర్సును ప్రవేశ పెట్టే ఆలోచనలో ఉందన్నారు. ఆసక్తి ఉన్న కోర్సులను పూర్తి చేయవచ్చన్నారు. మిగతా విశ్వవిద్యాలయాలతో పోల్చితే తమ సార్వత్రిక విశ్వవిద్యాలంలో ఫీజులు చాలా తక్కువని గుర్తు చేశారు. రెగ్యులర్‌గా డిగ్రీలు చేయలేనివారు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, గృహిణులు, వ్యాపారస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దూర విద్య డిగ్రీకి సాధారణ డిగ్రీకి సమానమైన విలువ ఉంటుందన్నారు. ఆదివాసీలు, ట్రాన్స్‌జెండర్లు, వికలాంగులకు ఫీజు లేకుండా ఉచిత విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్ రాధిక, స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ డా.శంకర్‌నాయక్ తదితరులున్నారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం వీడాలి

» కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సూదిని రాంరెడ్డి, కిషన్‌రెడ్డిలతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు/మాడ్గుల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హెచ్చరించారు. మాడ్గుల మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి పర్యటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మాడ్గుల గ్రామ పంచాయతీకి అదనంగా మంజూరైన 115 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, ఆమనగల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డిలతో కలిసి మంజూరు పత్రాలను ఎమ్మెల్యే కసిరెడ్డి అందజేశారు. లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలో రూ.7.75 కోట్లతో నూతనంగా నిర్మించే అంతర్గత మురుగు కాల్వ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం స్థానిక రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని, ప్రజలకు ఇబ్బందులు కలిగించిన, అందుబాటులో లేకపోయినా ప్రభుత్వం అధికారులను ఉపేక్షించబోదన్నారు. మాడ్గులలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు సమాచారం ఇవ్వకపోవడం పట్ల ఎంపీడీవో, గృహ నిర్మాణ శాఖ ఏఈ, పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 115 మంది కి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైతే 60 మంది లబ్ధిదారులు మాత్రమే రావడమేమిటని, సమాచార లోపమే కారణమని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల ఇంత నిర్లక్ష్యం ఏమిటని పలువురు అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోని వారు వెళ్లిపోవచ్చని కసిరెడ్డి సున్నితంగా సూచించారు. కొందరు అధికారులు సమస్యలను పట్టించుకోవడం లేదని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. తహసీల్దార్ వినయ్‌సాగర్, ఇంచార్జి ఎంపీడీవో వేణన్న, ఏవో అరుణకుమారి, ఏఎంసీ డైరెక్టర్లు పల్లె జంగయ్యగౌడ్, రమేశ్‌గౌడ్, నాయకులు సూదిని కొండల్ రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కాట్ల యాదయ్య, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న అడిషనల్ డీసీపీ పూర్ణచందర్

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

తలకొండపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నేర రహిత సమాజ నిర్మాణంలో సీసీ కెమెరాలు కీలకమని శంషాబాద్ అడిషనల్ డీసీపీ పూర్ణచందర్ అన్నారు. నేర పరిశోధన, నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంతో పాటు గట్టుఇప్పలపల్లిలో మంగళవారం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన 46 సీసీ కెమెరాలను షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, ఆమనగల్లు సీఐ జానకిరాంరెడ్డితో కలిసి అడిషనల్ డీసీపీ పూర్ణచందర్ ప్రారంభించారు. అనంతరం ఎస్సై శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అన్నారు. ట్రాఫిక్ జామ్, రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అనంతరం దాతలను అభినందించారు. తలకొండపల్లి ఎస్సైలు శ్రీకాంత్, శేఖర్, మాజీ సర్పంచ్‌లు లలిత జ్యోతయ్య, జయమ్మ, వెంకటయ్య, కానిస్టేబుల్ జాషువా తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆమనగల్లు సురసముద్రం చెరువు వద్ద గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పూర్ణచందర్ పరిశీలించారు. సీఐ జానకిరాంరెడ్డి, ఎస్సై వెంకటేశ్‌కు పలు సూచనలు చేశారు.

ఉత్సవాల విజయవంతానికి
సహకరించాలి



వినాయకుడికి పూజ చేస్తున్న ఎస్పీ దంపతులు

వికారాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలను అవాంతరాలు లేకుండా విజయవంతంగా పూర్తి చేసుకునేలా పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నెలకొల్పిన వినాయక నిమజ్జనం సందర్భంగా ఎస్పీ కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నిమజ్జనం సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలుతీసుకోవాలని, నదులు, చెరువుల లోతులకు వెళ్లొద్దని సూచించారు. కార్యక్రమంలో ఉమెన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సరోజ, ఆర్ఐ అంజత్ పాషా పాల్గొన్నారు.

చెరువు కట్టకు పొంచి ఉన్న ముప్పు

» కాలువ తీతతో కోతకు గురవుతున్న కట్ట

» బషీర్‌బాయ్ చెరువుకు గండి



అలుగు పారేందుకు కట్టకు తీసిన కాలువ

పెద్దేముల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మారెపల్లి తండాలోని బషీర్‌బాయ్ చెరువు కట్ట కోతతో తెగేలా ఉంది. మరోవైపు కట్టకు గండిపడింది. అలుగు పారేందుకు కట్ట పక్కనుంచే కాలువచేయడంతో కోతకు గురవుతూ కట్టకు ప్రమాదం పొంచిఉంది. చెరువు నిండి అలుగు మత్తడి కింద భూమి నుంచి పారేంది. అయితే సదరు రైతు తనపొలం నుంచి అలుగు పారకుండా అడ్డ కట్ట వేసి కట్టకు ఆనుకొని జేసీబీతో కాలువతీశాడు. భారీ వర్షాలకు చెరువునిండి నీరు కట్టకు తీసిన కాలువ నుంచి పారుతూ కోతకు గురవుతోంది. దీంతో గ్రామస్థులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే చెరువుకట్టకు గండిపడి నీరు వృథాగా పోతోంది. అధికారులు తక్షణం చర్యలు చేపట్టాల్సి ఉంది.

కోతకు గురవుతున్నది వాస్తవమే



అలుగుపారే నీటికి అడ్డుకట్టవేసి కట్టకు కాలువ తీయడంతో చెరువుకట్ట కోతకు గురవుతోంది. ఈ విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్తా. కట్టకు పడిన గండిని పూడుస్తాం. చెరువులో నీరు ఉన్నందున తాత్కాలికంగా ఇసుక బస్తాలతో గండి పూడుస్తాం.

- ప్రవీణ్‌కుమార్, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్

హైటెన్షన్ విద్యుత్ లైన్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకున్నరైతులు



టవర్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

కడ్తాల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రావిచెడ్‌లో 765 హైటెన్షన్ విద్యుత్ లైన్ నిర్మాణాన్ని రైతులు, గ్రామ నాయకులు అడ్డుకున్నారు. బీదర్ పవర్ గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ ఆధ్వర్యంలో బళ్లారి నుంచి మీర్‌ఖాన్ పేట వరకు హైటెన్షన్ విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కాగా, రైతుల ఆమోదం, పంచాయతీ తీర్మాణం లేకుండా అలైన్‌మెంట్ చేయడం సరికాదని రైతులు అభ్యంతరం తెలిపారు. టవర్ నిర్మాణం వద్దకు వెళ్లి పనులను అడ్డుకొని నిరసన తెలిపారు. అలైన్‌మెంట్‌ను మార్చి తాము సాగు చేసుకొని జీవనం పొందుతున్న పొలాల మీదుగా విద్యుత్ లైన్ ఏర్పాటు సరికాదని రైతులు, నాయకులు అభ్యంతరం తెలిపారు. లైన్ నిర్మాణానికి తీసుకుంటున్న భూములకు మూడు రెట్లు మరోచోట భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయమైన పరిహారం అందించాకే పనులు చేపట్టాలని అడ్డుకున్నారు. సంబంధిత అధికారి సంతోష్ కుమార్ టవర్ నిర్మాణం వద్దకు చేరుకొని రైతుల డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతానని తెలిపారు. తాము సమ్మతించే వరకు పనులు చేపట్టవద్దని తెలిపారు. అనంతరం రైతులు కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్, నాయకులు జనార్దన్‌గౌడ్, దశరథం, అంజయ్య, రవి, రాములు, కర్ణాజీ, మోహనాజీ, సమ్మి, వినయ్, హైమావతి, రైతులు తదితరులు ఉన్నారు.

చిన్నారి ఆరోగ్యంపై ఎమ్మెల్యే ఆరా..



కడ్తాల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎక్వాయిపల్లికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ జోగు వీరయ్య మనుమడు శ్రవణ్‌ను మంగళవారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ పరామర్శించారు. జోగు శేఖర్ స్నేహలత కుమారుడు శ్రవణ్ ఆడుకుంటూ ఇటీవల ఇంటి మిద్దెపై నుండి కింద పడ్డాడు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న చిన్నారిని జైపాల్ యాదవ్ పరామర్శించి వైద్యులను ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అందిన రూ.2 లక్షల ఎల్‌వోసీని తల్లిదండ్రులకు అందజేశారు. పరామర్శించిన వారిలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

ఘనంగా వైఎస్సార్ వర్ధంతి

చేవెళ్ల/ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/ షాబాద్/కందుకూరు/కేశంపేట/శంకర్‌పల్లి, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజల గుండెల్లో నిలిచిపోయిన నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. మంగళవారం వైఎస్సార్ 16వ వర్ధంతి సందర్భంగా చేవెళ్ల మండల కేంద్రంలో ఎమ్మెల్యే, నాయకులు పూలమాలలతో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. చేవెళ్ల మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, తదితరులున్నారు. ఆమనగలు మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదుట వైఎస్ విగ్రహం వద్ద మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్యల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనిత విజయ్, దళపతిగౌడ్, కృష్ణనాయక్, ఖాదర్, అంజన్‌రెడ్డి, కరీం, మహేశ్, శేఖర్, తదితరులున్నారు. కడ్తాల మండలకేంద్రంలో మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్‌లు హాజరయ్యారు. వైఎస్‌కు నివాళులర్పించారు. జహంగీర్‌బాబా, చందోజీ, గురిగల్ల లక్ష్మయ్య, రాంచందర్‌నాయక్, జహంగీర్, తదితరులున్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ చిత్రపటానికి నివాళులర్పించారు. మోహన్‌రెడ్డి, రవీందర్‌యాదవ్, అజీం, ఆరిఫ్, నర్సింహారెడ్డి, తదితరులున్నారు. ప్రజల గుండెల్లో నిలిచిపోయిన నేత వైఎస్ అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. షాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్‌కు నివాళులర్పించారు. గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ అశోక్, మాజీ సర్పంచులు జనార్దన్‌రెడ్డి, రవీందర్‌నాయక్, మహేందర్‌గౌడ్, నర్సింహులు, నాయకులు రాహుల్‌గుప్తా, గౌరీశ్వర్, సుభాష్‌రెడ్డి, తదితరులున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మహానుభావుడు అని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎస్ కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డిలు అన్నారు. కందుకూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వైఎస్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్యాక్స్ మాజీ చైర్మన్ మల్లేష్, మాజీ ఎంపీపీ మహేష్‌గౌడ్, మాజీ వైఎస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, నాయకులు రాణాప్రతాప్‌రెడ్డి, సరికొండ పాండు, ఎండీ అఫ్జల్ బేగ్, అనేగౌని పాండుగౌడ్, జి.సుధాకర్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్, డిల్లీ శ్రీధర్, తదితరులున్నారు. రాజశేఖర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని కేశంపేట మండల ప్రధాన కార్యదర్శి వై.గిరిధర్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. బీసా కరుణాకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, విజయ్ రెడ్డి, నాగేష్, వెంకటయ్య, నరేందర్ రెడ్డి, హరీశ్వర్ రెడ్డి, రాఘవేందర్, తదితరులున్నారు. కొందుర్గు మండల పరిధిలో పలువురు నాయకులు నివాళులర్పించారు. గోవర్ధన్‌గౌడ్, వెంకటేశ్, నరసింహారెడ్డి, బాల్‌రెడ్డి, కుమార్, నర్సింహులు, తదితరులున్నారు. వైఎస్ సేవలు మరువలేనివని శంకర్‌పల్లి మండ లాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి అన్నారు. శంకర్‌పల్లి చౌరస్తాలో వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. ప్రకాష్, రవిందర్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, నసీరుద్దీన్, కృష్ణారెడ్డి, శంకరయ్య తదితరులున్నారు.



చేవెళ్ల : నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య నాయకులు



ఆమనగల్లు : వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, జగన్



కేశంపేట : వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



షాబాద్ : వైఎస్ఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

8న కందుకూరుకు మందకృష్ణ మాదిగ రాక



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి బక్కని రవి

మహేశ్వరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 8న కందుకూరులో ఎమ్మార్పీఎస్ మహాసభ నిర్వహి స్తున్నామని. మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి బక్కని రవి తెలిపారు. మహాసభ సన్నాహక సమావేశం మంగళవారం మండల కేంద్రంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ రానున్నందున నియోజకవర్గంలోని వికలాంగులు, వితంతులు, వృద్ధులతో పాటు ఎమ్మార్పీఎస్ అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన అన్నారు. కృష్ణ, జంగన్న, నవీన్‌కుమార్, అర్జున్, మల్లేష్, యాదయ్య, సురేష్ తధితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి

శంకర్‌పల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుతూ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని మాజీ కౌన్సిలర్ సంతోష్ రాథోడ్ తెలిపారు. పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ఆయన శంకర్‌పల్లి మున్సిపల్‌లోని సింగాపురం టవర్ వద్ద గల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం ప్లేట్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

7,52,259

(ఐదో పేజీ తరువాయి)

తహసీల్దార్లు, ఎంపీడీవోలకు పంపించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్వరలోనే అవి అప్డేట్ కానున్నాయి.

తొమ్మిది మండలాల్లో నో థర్డ్ జెండర్

జిల్లాలోని 21 గ్రామీణ మండలాల్లో 526 పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 4,668 వార్డులకు 4,682 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. తుది జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 7,52,259 ఓటర్లు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. వీరిలో 3,76,823 పురుషులు, 3,75,408 మహిళ ఓటర్లు, 28 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. జిల్లాలోని తొమ్మిది మండలాలు ఆమనగల్లు, కందుకూరు, కేశంపేట, కొందుర్గు, మాడ్గుల, మంచాల, శంషాబాద్, శంకర్‌పల్లి, తలకొండపల్లిలో థర్డ్ జెండర్ ఓటర్లు ఎవరూ లేరని ఓటరు జాబితా ద్వారా అధికారులు వెల్లడించారు.

సింహభాగం మహిళా ఓటర్లే

జిల్లాలోని 21 గ్రామీణ మండలాలు ఉండగా ఇందులో 10 మండలాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. యాచారం మండలంలో పురుషుల ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 248 మంది ఎక్కువగా ఉన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 101 మంది, ఫరూక్‌నగర్ మండలంలో 308, ఇబ్రహీంపట్నం 273 మంది, కేశంపేట మండలంలో 315 మంది, కొందర్గు మండలంలో 299 మంది, మహేశ్వ రం మండలంలో 118మంది, నందిగామ మండలంలో 92మంది, శంషాబాద్ మండలంలో 337 మంది ఉన్నారు. అలాగే శంకర్‌పల్లి మండలంలో 380మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

తుది జాబితాను పబ్లిష్ చేశాం



రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఫైనల్ పోలింగ్ స్టేషన్ల వివరాలు, గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను పబ్లిష్ చేశాం. ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి స్వీకరించిన అభ్యంతరాలను పరిశీలించి డిస్పోజ్ చేశాం. తర్వాత గ్రామ పంచాయతీ పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల జాబితాను విడుదల చేశాం.

- సురేష్ మోహన్, డీపీవో

పోలింగ్ కేంద్రాలు

మండలం	వార్డులు	కేంద్రాలు
అబ్దుల్లాపూర్‌మెట్	134	148
ఆమనగల్లు	112	112
చేవెళ్ల	218	218
ఫరూక్‌నగర్	410	410
ఇబ్రహీంపట్నం	144	144
జిల్లేడ్ చౌదరిగూడ	204	204
కడ్తాల్	210	210
కందుకూరు	312	312
కేశంపేట్	260	260
కొందుర్గు	186	186
కొత్తూరు	110	110
మాడ్గుల	302	302
మహేశ్వరం	258	258
మంచాల	216	216
మొయినాబాద్	166	166
నందిగామ	170	170
షాబాద్	352	352
శంషాబాద్	190	190
శంకర్‌పల్లి	210	210
తలకొండపల్లి	272	272
యాచారం	232	232
మొత్తం	4,668	4,682

ఇదేం తరగతి!

(ఐదో పేజీ తరువాయి)

ఎస్‌జీటీ పోస్టులు ధర్మతండా, వేపకుచ్చతండా, గోవుల బండ తండా చెన్నారెడ్డిగూడ, మల్కపహాడ్, జాకారం, నంద్యతండాలో ఉన్న యూపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

విద్యార్థుల సంఖ్య పెరిగినా..

బడిబాట కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగినా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వెంటాడుతోంది. మండల పరిధిలోని తుమ్మలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని ఇటీవల లాల్‌పహాడ్ చౌరస్తాలో విద్యార్థులు ధర్నా చేపట్టారు. యూపీఎస్ పాఠశాలలో 20 మందికి పైగా విద్యార్థులుంటే నలుగురు ఉపాధ్యాయులు ఉండాలి. కానీ, 100 మంది విద్యార్థులకు నలుగురే ఉపాధ్యాయులున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. 6, 7 తరగతులు బోధించేందుకు పాఠశాలలో ఉపాధ్యాయులే లేరు. పాఠశాలలో ఆరుగురు ఉపాధ్యాయులుండగా ఒక ఉపాధ్యాయుడు జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం పొంది వెళ్లారు. ఆగస్టులో ప్రభుత్వ బదిలీలో భాగంగా పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న శంకర్ జీహెచ్‌ఎంగా పదోన్నతిపై బొంరాస్‌పేట్ మండలం హకీంపేటకు వెళ్లారు.

పట్టించుకోని అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామంటూ గొప్పలు చెబుతుందే కానీ క్షేత్రస్థాయిలో ఏమాత్రం పట్టించుకోవడం లేదని పలువురు రాజకీయ పార్టీల నాయకులు విమర్శిస్తున్నారు. ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌లు, కొత్తగా ఉపాధ్యాయుల నియామకం వంటి విషయాల్లో జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పలుకుబడి ఉన్న ఉపాధ్యాయులు తమకు ఇష్టం వచ్చిన చోటుకు డిప్యూటేషన్‌లు వేయించుకుంటున్నారు. సంబంధిత అధికారులకు ప్రభుత్వ విద్యా వ్యవస్థ పూర్తిగా మెరుగుపడాలంటే విద్యాశాఖను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది.

టీచర్లు లేక విద్యకు దూరం

ఉపాధ్యాయులు లేక విద్యకు దూరమవుతున్నాం. మా తల్లిదండ్రులు కూలిపని చేసి చదువుకోవడాని లచ్చంపేట నుంచి ఆటోకు డబ్బులు చెల్లించి పంపుతున్నారు. ఉపాధ్యాయులు లేక సరైన విద్యను పొందలేకపోతున్నాం.

- వడ్డెగారి వైష్ణవి, ఆరో తరగతి, తుమ్మలపల్లి

అధైర్యపడొద్దు అండగా ఉంటాం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అధైర్య పడవద్దు అండగా ఉంటామని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. కొండిగాని బోడు తండాలో మంగళవారం దశరథ్ నాయక్ పర్యటించారు. ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఇటీవల మృతిచెందిన బీమ్లి కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి రాదాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5వేలు, మాజీ ఉప సర్పంచ్ శ్రీనునాయక్ రూ.10,500 ఆర్థిక సాయం అందజేశారు. సాలార్‌పూర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన జంగయ్య మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ట్రస్ట్ ద్వారా రూ. 5 వేలు ఆర్థిక సాయం అందించారు. తండాలో ఇటీవల మృతి చెందిన లక్ష్మి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు సాయమందించారు. మాజీ ఎంపీపీ సువాలిపంతూ, ఎంపీటీసీ ప్రియరమేశ్, రాజు, బాబా, శ్రీను, హరిచంద్, బాలు, మున్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష

ఆమనగల్లు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీల అమలుకై నేడు(బుధవారం) కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపడుతున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు దీక్ష కొనసాగుతుందని చెప్పారు.

ఏకదంతుడికి ఘన పూజలు.. నిమజ్జనాలు

అన్ని గ్రామాల్లో గణేశ్ నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పల్లెలు, పట్టణాలు ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నాయి. యువజన సంఘాలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వాడవాడల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. వివిధ రూపాల్లో కొలువుదీరిన పార్వతీ తనయుడు బొజ్జగణపయ్యలను వీక్షించేందుకు భక్తులు మండపాలకు తరలివస్తున్నారు. కాగా, పలుచోట్ల విగ్రహాలను నిమజ్జనం చేశారు.



షాద్‌నగర్ : పూజలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి



కడ్తాల్ : మైసిగండి వద్ద పూజలో శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సీఐ గంగాధర్



తలకొండపల్లి : వెల్జాల్‌లోని వినాయకుడి పూజలో మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్



యాచారంలో గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు



చేవెళ్ల : శ్రీ చైతన్య కళాశాల వినాయకుడి లడ్డూను కైవసం చేసుకున్న సయ్యద్ అత్తార్ మహమ్మద్

విధుల్లో చేరిన ఎంపీడీవో మాధురి

ఆమనగల్లు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ఎంపీడీవో మాధురి మంగళవారం విధుల్లో చేరారు. నెలన్నర కాలంగా ఎంపీడీవో సెలవుపై వెళ్లారు. ఆమె స్థానంలో మహేశ్వరం మండల పరిషత్ సూపరింటెండెంట్ రహెమాన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు మండల స్పెషలాఫీసర్ శోభారాణి, ఎంపీవో వినోద, మండల అధికారులు సత్కరించి అభినందించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసి రిలీవ్ అయిన రహెమాన్ కు వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో శ్రీనివాస్ గౌడ్, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.



ఎంపీడీవోను సన్మానిస్తున్న శోభారాణి, తదితరులు

స్నేహితుడికి ఆర్థిక చేయూత

ఆమనగల్లు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణానికి చెందిన రజనీకాంత్ రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఆపరేషన్‌కు రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆమనగల్లు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1997-98 బ్యాచ్ పదో తరగతి స్నేహితులు మంగళవారం రజనీకాంత్‌కు రూ.32వేలు ఆర్థిక సహాయం అందించారు. దశరథం, ప్రవీణ్, బాబా, రాజు, తదితరులున్నారు.



ట్రాన్స్‌కో ఏడీ, ఏఈలకు సత్కారం

కందుకూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులమైలారంలో విద్యుత్ లోఓల్టేజీతో రైతులు సతమతమవుతుండడంతో మంగళవారం 11కేవీ విద్యుత్, ఏడు ఎల్టీస్తంభాలు, రెండు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ట్రాన్స్‌కో అధికారులు సమకూర్చారు. ఈమేరకు డీఈ గోపాలకృష్ణ, ఏఈ వేణుగోపాల్‌రెడ్డిలను రైతులు సత్కరించారు. రైతులకు మెరుగైన విద్యుత్ అందించి ఆదుకుంటామని డీఈ గోపాలకృష్ణ రైతులకు హామీ ఇచ్చారు.

త్రిపుల్ ఆర్ రోడ్డు మూలంగా భూములు కోల్పోకుండా చూడాలి

- ఎమ్మెల్యేకు సింగంపల్లి రైతుల వినతి

ఆమనగల్లు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించే రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చి తమకు అన్యాయం జరుగకుండా చూడాలని ఆమనగల్లు మండలం సింగంపల్లి గ్రామ రైతులు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కోరారు. మంగళవారం ఈ మేరకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. త్రిబుల్ ఆర్ రోడ్డు మూలంగా తాము తరాలుగా సాగుచేసుకొని జీవనం పొందుతున్న భూములు కోల్పోతామని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన సర్వేనెంబర్లలో చాలామంది పేద, సన్న, చిన్నకారు రైతులే ఉన్నారని పేర్కొన్నారు. రైతుల విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని ఎమ్మెల్యే తెలిపారు. భూములు కోల్పోయేవారికి ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకుంటుందన్నారు.

క్రైం కార్నర్

అగ్నికి ఆహుతైన వినాయక మండపం

యాచారం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు వినాయక మండపం అగ్నికి ఆహుతైంది. సోమవారం మధ్యాహ్నం నిర్వాహకులు గణనాథుడిని నిమజ్జనం చేశారు. అయితే, మండపానికి విద్యుత్ కనెక్షన్ నిలిపివేయలేదు. అర్ధరాత్రి 12 గంటలకు షార్ట్‌సర్క్యూట్ కారణంగా మండపానికి మంటలంటుకున్నాయి. విషయం తెలుసుకున్న ఎస్సై మధు గ్రామానికి చేరుకొని మంటలార్పేందుకు యత్నించగా అప్పటికే పూర్తిగా కాలిపోయింది. కాగా, మంగడపానికి విద్యుత్ కనెక్షన్ తొలగించకపోవడంపై గ్రామస్థులు నిర్వాహకులపై మండిపడుతున్నారు.

అండర్-14 క్రికెట్‌లో దూసుకెళ్తున్న సాయిచరిత్



చేవెళ్ల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అండర్-14 క్రికెట్‌లో షాబాద్ మండలం నాగర్‌గూడకు చెందిన జోగు సాయిచరిత్ (9వ తరగతి) అద్భుత ప్రతిభ కనబరుస్తున్నాడు. మంగళవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధి చిల్కూర్ పరిధిలోని రాహుల్ క్రికెట్ గ్రౌండ్‌లో నోబెల్ వర్సెస్-హైదరాబాద్ అకాడమీ జట్ల మధ్య టీ-20 క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో నోబెల్ టీం తరఫున బరిలోకి దిగిన సాయిచరిత్ 7.5 ఓవర్ల వేసి 11 పరుగులు ఇచ్చి 6 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అయితే, సాయిచరిత్ గత జనవరిలో దుబాయ్ వేదికగా జరిగిన అండర్-16 క్రికెట్‌లో పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్ జట్లపై ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ప్రస్తుతం బండ్లగూడ జాగీర్‌లోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. జట్టు విజయాలతో కీలకపాత్ర పోషిస్తున్న సాయిచరిత్‌ను కోచ్ ప్రవీణ్ ఈ సందర్భంగా అభినందించారు.

ప్రజల సమస్యలు పట్టని అధికారులు



మంథన్‌గౌరెల్లిలో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

యాచారం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లో ప్రజలు సమస్యలతో బాధపడుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని సీపీఎం నాయకులు ప్రశ్నించారు. మంగళవారం మంథన్‌గౌరెల్లిలో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. చాలామంది పక్కా ఇళ్లు లేవని, గుడిసెల్లో ఉంటున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్లు రాలేదని మండల నాయకులు చందూనాయక్, థావ్‌నాయక్ తదితరులు అధికారుల తీరుపై మండిపడ్డారు. మురికి కాలువలు పాడైనా ఎందుకు బాగుచేయడం లేదన్నారు. పేదలకు పింఛన్లు అందక తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని చెప్పారు. ఆరు గ్యారంటీలు అటకెక్కాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎస్సీ వసతి గృహానికి మరమ్మతులు చేపట్టాలి

కందుకూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేదునూరు ఎస్సీ వసతి గృహం శిథిలావస్థకు చేరుకుందని, ప్రభుత్వం వెంటనే మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు బి.శ్రీనివాస్, ఎ.కుమార్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామశాఖ కార్యదర్శి మిద్దె యాదయ్య ఆధ్వర్యంలో వసతి గృహాన్ని పరిశీలించి, విద్యార్థుల సమస్య లను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం స్లాబ్ కింది భాగం వర్షానికి పెచ్చులు పడిపోతున్నట్లు తెలిపారు. భవనం ఎప్పుడు కూలిపోతుందోనని ఆందోళనతో విద్యార్థులు బిక్కుబిక్కుమని ఉంటున్నట్లు తెలిపారు. నాయకులు ఉన్ని సాయిలు, వి.యాదయ్య, కె.రాములు, ఎండీ జాఫర్‌బేగ్, బి.మైసయ్య, బి.చెన్నయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామం వద్ద అడ్డుకట్ట తొలిగించండి

కేశంపేట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేములనర్వ శివారులోని వైకుంఠధామానికి అడ్డుగా ఏర్పాటు చేసిన కట్టను తొలగించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ అజాంఅలీ, ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డిలకు గ్రామస్తులు వేర్వేరుగా వినతిపత్రం అందించారు. గ్రామ సమీపంలోని చింతకుంటపల్లికి వెళ్లేమార్గంలో వైకుంఠధామం ఉందని తెలిపారు. వైకుంఠధామం అనుసరించి ప్రభుత్వ భూమిలో రియల్టర్లు, ఇతర రైతులు మట్టితో అడ్డుకట్ట వేశారని వివరించారు. దీంతో పైనుంచి వచ్చే వరద, వైకుంఠధామంలో నిలిచిపోయి చెరువును తలపిస్తుందని తెలిపారు. ఎవరైనా చనిపోతే ఖననం చేయడానికి ఇబ్బందిగా మారిందని వివరించారు. నీరు ముందుకు పారకుండా అడ్డుకట్ట వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. మల్లేష్, చిర్ర శీను, దాసునాయక్, రాఘవేందర్, శ్రీకాంత్, శ్రీశైలం, ఎల్లయ్య, కుమార్, శ్రీను తదితరులున్నారు.

ఘనంగా కేఎస్ రత్నం జన్మదిన వేడుకలు



రత్నంను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మొయినాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పుట్టిన రోజు వేడుకలు మంగళవారం మొయినాబాద్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, అభిమానులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. మొయినాబాద్ పట్టణ కేంద్రంలోని ఆయన నివాసం వద్ద నాయకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. రత్నంను శాలువాలు, బొకేలు, పూలదండలతో సన్మానించారు. కొందరు ఆయనకు పుస్తకాలు, పెన్నులు అందించారు. వాటిని నిరుపేద విద్యార్థులకు ఇవ్వనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రత్నం 66వ పుట్టిన రోజును పురస్కరించుకుని 66 కిలోల కేక్‌ను కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అంజన్‌కుమార్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, శ్రీరాములు, ఎల్లని వెంకటేశ్‌గౌడ్, డాక్టర్ వైభవ్‌రెడ్డి, శంకర్‌గౌడ్, కృష్ణగౌడ్, వీరారెడ్డి, సుదీంద్ర, కృష్ణ, ఇంద్రసేనారెడ్డి, అశోక్, శ్రీకాంత్, మండలాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించేందుకు దాతలు సహకరించాలి

తలకొండపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు దాతలు, స్వచ్ఛంద సంస్థలుముందుకు రావాలని తహసీల్దార్ రమేశ్ కోరారు. చుక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చీపునుంతలకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎర్ర సుధాకర్‌రెడ్డి ఉన్నతి శిక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.2.50 లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలను మంగళవారం తహసీల్దార్ రమేశ్ ప్రారంభించారు. సుధాకర్ రెడ్డిని స్థానికులు, టీచర్లు అభినందించారు. ఎంఈవో చంప్లానాయక్, డీటీ సంతోష్, మాజీ సర్పంచ్ రఘుపతి, ఎంపీటీసీ యాదయ్య, ఏమిరెడ్డి రంగారెడ్డి, షహనాజ్ సుల్తాన్, బాల్‌కోటి, తదితరులు ఉన్నారు.



సుధాకర్‌రెడ్డితో కలిసి మరుగుదొడ్లు, మూత్రశాలలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ రమేశ్